తువ్వకాలువ గండ్లు పూడ్చరూ..

- ఖరీఫ్, రబీ సీజన్ కోల్పోయిన ఆయకట్టు రైతులు
- ఆరునెలలైనా పట్టించుకోని పాలకులు
- నేటికీ బాగుపడని పొలాలు
- గండ్లు పూడ్చివేస్తారని ఆశగా ఎదురుచూస్తున్న రైతులు


తువ్వకాలువకు ఆళ్లూరుపాడు వద్ద పడిన భారీ గండి

పెనుగంచిప్రోలు: తుఫాన్ ప్రభావంతో గతేడాది సెప్టెంబర్ నెలలో కురిసిన భారీవర్షాలకు మునేరు పక్కన ఉన్న తువ్వకాలువకు 40చోట్ల వరకు గండ్లు పడగా... వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, వేములనర్వ వద్ద నాలుగు పెద్దగండ్లు, పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు వద్ద ఓ పెద్ద గండి పడింది. దీంతో వత్సవాయి మండలం పోలంపల్లి నుంచి ప్రారంభమయ్యే మునేరు ప్రాజెక్టు పరిధిలోని తువ్వకాలువకు సాగునీరు ప్రవహించక ఆయకట్టు రైతులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు.

3వేల ఎకరాల ఆయకట్టు..

మునేరు ప్రాజెక్టు కింద తువ్వకాలువ(పెనుగంచిప్రోలు) బ్రాంచ్ కింద సుమారు 3వేల ఎకరాల వరకు సాగునీరు అందుతోంది. వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు, వేమవరం, పెనుగంచిప్రోలు మండలంలోని ముచ్చింతాల, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు వరకు తువ్వకాలువ విస్తరించి ఉంది. కాలువకు ముఖ్యంగా వేమవరం, ఆళ్లూరుపాడు వద్ద తువ్వకాలువకు పెద్ద గండ్లు పడ్డాయి.

రెండుసీజన్లు కోల్పోయిన రైతులు...

తువ్వకాలువకు గండ్లు పడటంలో ఆ ఖరీఫ్ సీజన్‌లో రైతులు విలువైన పంట కోల్పోయారు. పొలాల్లో ఇసుక మేట, భూములు కోతకు గురికావడం, మోటార్లు, బోర్లు పాడవ్వటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గండ్లుపడి ఆరునెలలవుతున్నా వాటిని పూడ్చించే విషయంపై పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గండ్లు పూడ్చకపోవడంతో రైతులు ఖరీఫ్‌తోపాటు రబీసాగు కూడా కోల్పోయారు. కొద్దిమంది రైతులు తమ పొలాలను బాగుచేసుకుని రబీసాగు చేపట్టగా, అధికశాతం మంది రైతులు మాత్రం పొలాలను అలాగే వదిలేశారు. నేటికీ పొలాల్లో ఇసుక మేటతో పాటు వరద నీరు అలాగే ఉంది.


ముచ్చింతాల వద్ద నేటికీ తటాకాన్ని తలపిస్తున్న పంట పొలం


పూడ్చివేతకు నోచుకోని అనిగండ్లపాడు వద్ద తువ్వకాలువకు పడిన గండి

తక్షణం గండ్లు పూడ్చాలి...



తువ్వకాలువకు గండ్లు పడటంతో రైతులు ఖరీఫ్, రబీ సీజన్లు కోల్పోవాల్సి వచ్చింది. నేటికీ పంట పొలాలు ఇసుక మేటతో, వరద నీటితో కనిపిస్తున్నాయి.గత ప్రభుత్వంలో గండ్లు పడిన వెంటనే పూడ్చించారు. తువ్వకాలువ గండ్లను వెంటనే పూడ్చించి రైతులను ఆదుకోవాలి.

ఉన్నం శ్రీనివాసరావు, రైతు, అనిగండ్లపాడు

ప్రతిపాదనలు పంపించాం..

మునేరు తువ్వకాలువకు ఆళ్లూరుపాడు వద్ద, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రామాల మధ్య భారీ స్థాయిలో గండ్లు పడ్డాయి. మొత్తం తువ్వకాలువకు 40చోట్ల గండ్లు పడ్డాయి. వీటి మరమ్మతులకు రూ.1.60కోట్లకు అంచనాలు తయారుచేసి నివేదిక ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరైతే వెంటనే పనులు ప్రారంభిస్తాం. మునేరు ప్రధాన కాలువకు పడిన గండ్లు వెంటనే పూడ్చించాం. లైనింగ్ పనులు జరగాల్సి ఉంది.

ప్రసన్నలక్ష్మి, ఇరిగేషన్ జేఈ

ఇసుక మేటకు అందని నష్టపరిహారం...

వరదలకు వత్సవాయిలో 275మంది రైతులకు చెందిన 117.7హెక్టార్లు, పెనుగంచిప్రోలు మండలంలో 196మంది రైతులకు చెందిన 125.3 హెక్టార్లలో పంటపొలాల్లో ఇసుక మేట వేసింది. వత్సవాయి మండలంలో ఐదుగురు రైతులకు చెందిన 2.0 హెక్టార్లు, పెనుగంచిప్రోలు మండలంలో ఇద్దరు రైతులకు చెందిన 0.6హెక్టార్లలో కోతకు గురయ్యాయి. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు మాత్రమే ఎకరానికి రూ.10వేలు చెల్లించి చేతులు దులుపుకుంది. ఇసుక మేటకు, కోతకు గురైన భూములకు ప్రభుత్వం తమకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదని బాధితులు వాపోతున్నారు. ఇకనైనా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) స్పందించి తువ్వకాలువకు పడిన గండ్లు పూడ్చివేతకు తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

వేములనర్వ వద్ద ఇసుక మేట వేసిన పంట పొలం


క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ప్రత్యేక సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం 5గంటలకు వివిధ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీలకు సంబంధించి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ శనివారం తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ వలంటీర్లు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

ముగిసిన రోడ్డు భద్రతా వారోత్సవాలు

కంచికచర్ల: రోడ్డు ప్రమాదాల నివారణలో అధికారులతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలని స్వర్ణటోల్‌ప్లాజా సీఎం రాజారావు కోరారు. జాతీయ భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలో కీసర టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు శనివారం అవగాహన కల్పించారు. హైవేపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలు, జాగ్రత్తలపై వాహన డ్రైవర్లు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కారు నడిపే ప్రతిఒక్కరూ సీట్‌బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఎన్‌హెచ్ఏఐ సేఫ్టీ అధికారి శ్రీనివాస్, ప్లాజా మేనేజర్ జయప్రకాష్, సెక్యూరిటీ మేనేజర్ ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.2.46 లక్షలు



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారికి భక్తులు సమర్పించిన కానుకల హుండీ ద్వారా రూ.2.46 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి ఈవో సురేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం హుండీ లెక్కింపు చేపట్టారు. 11నెలలకుగాను రూ.2.46లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన వివరించారు. ఈనెల 24 నుంచి 28వరకు మహాశివరాత్రి ఉత్సవాలకు కొబ్బరిచిప్పలు పోగు చేసుకునేందుకు, లడ్డూ ప్రసాదాల విక్రయాలకు వేలం పాటలు నిర్వహించారు. ఈ పాటల్లో కొబ్బరిచిప్పలు పోగు చేసేకునే హక్కులు రూ.57 వేలు పలికినట్లు తెలిపారు. లడ్డూ అమ్మకాల వేలానికి పాటదారులు ఆసక్తిచూపకపోవడంతో వాయిదా వేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, భక్తులు పాల్గొన్నారు.

డెప్యూటీ లిస్టులో మరికొంత మంది..!

- ఫోన్‌పే లిస్ట్‌కు పోలీసుల ఫోన్
- విచారణకు హాజరు కాని సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి ఆదాయానికి గండి కొట్టిన దళారి డెప్యూటీ లిస్టు మరింతగా పెరుగుతున్నట్లు తెలుస్తోంది. తొలుత డెప్యూటీ ఫోన్ పేలో ఉన్న 28 మంది వివరాలను నమోదు చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు కాల్ లిస్ట్ ఆధారంగా మరి కొంతమంది ఉన్నట్లు గుర్తించారు. ఫోన్ పే ఆధారంగా నమోదు చేసిన దేవస్థాన ఉద్యోగులను స్టేషన్‌కు రావాల్సిందిగా పోలీసులు ఆదేశించారు. అయితే శనివారం కేవలం ఆరుగురు మాత్రమే విచారణకు హాజరయ్యారు. మిగిలిన వారు పోలీసుల ఫోన్‌కు స్పందించడం లేదు. మరోవైపు ఆలయంలోని కీలక వ్యక్తులు పోలీసు ఉన్నతాధికారిని ఆశ్రయించినట్లు సమాచారం. ఈ ఘటనలో ఎప్పుడేం జరుగుతుందోనని ఆలయ సిబ్బంది గుండెలను అరచేతిలో పెట్టుకుని తిరుగుతున్నారు. దుర్గగుడి ఈవో రామచంద్రమోహన్ ఈ వ్యవహారంపై ఏ విధంగా స్పందిస్తారనే విషయం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

భారతీయ సనాతన ధర్మశిల్పి ఆదిశంకరులు



విజయవాడ కల్చరల్: భారతీయ సనాతన ధర్మశిల్పి ఆదిశంకరులని ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థ మహాస్వామి 75వ వర్ధంతి సందర్భంగా శృంగేరీ పీఠ ఉత్తరాధికారి విధుశేఖర భారతీ స్వామి ఆదేశంతో 75 రోజులపాటు శివరామకృష్ణక్షేత్రంలో నిర్వహిస్తున్న నవచండీ హోమం, చండీపారాయణ ఆధ్యాత్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శనివారం సామవేదం శంకర విజయంపై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ జగద్గురువులు గ్రంథాలను నిత్యం పఠించాలని సూచించారు. శంకరుల బోధనలు సదా స్మరణీమని తెలిపారు. అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్షేత్రధర్మాధికారి హనుమత్ ప్రసాద్, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి విశ్రాంత కార్యనిర్వహణ అధికారి రామారావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత సామవేదం.. జగద్గురువుల విగ్రహానికి పూజలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



నందిగామటౌన్: మండలంలోని కంచల మునేటి తీరాన వేంచేసియున్న అనంత శేషవాసుకి జంట నాగుల ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆంజనేయప్రసాద్ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పంచామృతాభిషేకాలు, విశేష పుష్పార్చన పూజలను వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ధనుంజయరావు, భక్తులు, పెద్దసంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.78వేల ఆదాయం

నందిగామటౌన్: లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారి ఆలయానికి చీరల వేలం పాట ద్వారా రూ.78వేల ఆదాయం సమకూరిందని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్ల అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు శనివారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 283 చీరలకు వేలం పాట నిర్వహించగా రూ.78వేల ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో చందర్లపాడు గ్రూప్ టెంపుల్స్ ఈఓ తేజ, ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆయా దేవాలయాల అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ.4.90కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

జిల్లా వైద్యాధికారిణి సుహాసిని


వీరులపాడు పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

వీరులపాడు(కంచికచర్ల): ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వచ్చే రోగులకు వైద్యసిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. వీరులపాడులోని ప్రాథమిక ఆరోగ్యేంద్రంతోపాటు జయంతి సబ్ సెంటర్, పలు అంగనవాడీ కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. ముందుగా పీహెచ్‌సీలోని రికార్డులతోపాటు మందుల స్టాక్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, రోగులకు అవసరమైన చికిత్స చేయడంతోపాటు మందులు కూడా పంపిణీ చేయాలన్నారు. టీటీ ఇంజక్షన్లు ప్రతి పీహెచ్‌సీలలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందజేయాలని అంగనవాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు దీపిక, ఆరోగ్య సిబ్బంది, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూదవాడకు ఎల్ఈడీ లైట్లు పంపిణీ


ఎల్ఈడీ లైట్లు అందజేస్తున్న శ్రీవాత్సవ

జయంతిపురం(జగ్గయ్యపేట): సీఎస్ఆర్ నిధులతో గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తున్నామని రామ్‌కో సిమెంట్స్ ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవాత్సవ తెలిపారు. ఫ్యాక్టరీలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో బూదవాడ గ్రామం కోసం గ్రామాభివృద్ధి కమిటీకి రూ. 96వేల విలువ చేసే ఎల్ఈడీ వీధిలైట్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి యాజమాన్యం ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. కొన్ని గ్రామాలను దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేట సీఐ కార్యాలయం కోసం రెండు కంప్యూటర్లను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం ఫరూక్ అహ్మద్, మైన్స్ జీఎం జాన్‌రెడ్డి, డీజీఎం రామకృష్ణసాయి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..

ఎమ్మెల్యేకు 31వ వార్డు ప్రజల వినతి


ఎమ్మెల్యే తాతయ్యకు సమస్యలు వివరిస్తున్న 31వ వార్డు ప్రజలు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని 31వవార్డులో నెలకొన్న డ్రెయిన్లు, కరెంట్ లోవోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలని ఆవార్డు ప్రజలు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)కు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే తాతయ్య శనివారం 31వ వార్డులోని శాంతినగర్, విష్ణుప్రియనగర్‌లో పర్యటించారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సీసీరోడ్డు నిర్మించాలని, పింఛన్లు మంజూరు చేయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, పేరం సైదేశ్వరరావు, కంచేటి గీతారాణి, నకిరిగంటి వెంకట్, టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి మైనేని రాధాకృష్ణ, నాయకులు గింజుపల్లి రమేష్, గట్టిడి దుర్గాప్రసాద్, వేదులాపురి సైదా, పూసాల పుల్లారావు, కనపర్తి సత్యనారాయణప్రసాద్, రావూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన


ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ఎం.ఎస్.రాజు

జగ్గయ్యపేట అర్బన్: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) ఎం.నారాయణరాజు హెచ్చరించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు రోడ్డుభద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ ఆటో వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. రోడ్డు భద్రతలో ఆటోడ్రైవర్లు ప్రత్యేకజాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. మద్యం సేవించి ఆటోలను వాహనాలు నడపరాదన్నారు. సరైన పత్రాలు వాహనంలో ఉంచాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ గురవయ్య, ఆటో యూనియన్ అధ్యక్షుడు ప్రభు, యూనియన్ల నేతలు సాంబయ్య, సైదులు, రాజు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

క్రీడావస్తువులు అందజేత



వత్సవాయి: మండలకేంద్రం వత్సవాయిలోని దాస్ లెవన్ క్రికెట్ టీంకు దబ్బాకుపల్లి సర్పంచ్ కొట్టె నగేష్ శనివారం క్రీడావస్తువులను అందజేశారు. జట్టు సభ్యులందరికీ బ్యాట్లు, టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో క్రీడాకారులకు ఆయా క్రీడావస్తువులు పంపిణీ చేసినట్లు తెలిపారు. క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలని సూచించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జగ్గయ్యపేటకు చెందిన కొలగాని అంజయ్య కుటుంబసభ్యులు రూ.1,00,116లను విరాళంగా శనివారం అందించినట్లు ఆలయ ఏసీ వరప్రసాద్ తెలిపారు. దాత కుటుంబసభ్యులకు ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.

15మంది జూదరుల అరెస్ట్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని తిరుమలగిరి–మంగొల్లు రోడ్డులోని పంట పొలాల్లో శనివారం పేకాడుతున్న 15మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ తెలిపారు. వారి వద్ద నుంచి 13 ద్విచక్రవాహనాలు, రూ.6500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సజావుగా పింఛన్ల పంపిణీ : కలెక్టర్


పరిటాలలో క్లాప్‌మిత్రతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కన ఆర్డీఓ బాలకృష్ణ

కంచికచర్ల: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పటిష్ట పర్యవేక్షణలో ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కంచికచర్ల మండలంలోని పరిటాల, ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో శనివారం ఆయన పర్యటించారు. సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సాగుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని ప్రారంభించి తొలిరోజునే జిల్లాలోని 2,29,913 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పింఛన్ల పంపిణీ సజావుగా సాగుతోందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పింఛన్లుదారులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పరిటాలలోని చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని(ఎస్‌డబ్ల్యూపీసీ) కలెక్టర్ పరిశీలించారు. ఈ కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేలా, సామర్థ్యం మేరకు వర్మీ కంపోస్టును తయారుచేసేలా సిబ్బందికి ఆదేశాలిచ్చారు. గ్రామంలోని డ్రెయిన్లను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరుపై సిబ్బందితో మాట్లాడారు. తడిచెత్త, పొడి చెత్తను విడివిడిగా సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ కే శ్రీనివాసరావు, నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ, కంచికచర్ల ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ బి.శ్రీనివాసరావు, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, డిప్యూటీ తహసీల్దార్ మానస, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

97 శాతం పింఛన్ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో 19 గ్రామ సచివాలయాల్లో శనివారం అన్ని రకాల పింఛన్లు కలిపి 97 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. మల్కాపురం, గండ్రాయి, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో సాగుతున్న పింఛన్ల పంపిణీని శనివారం ఆయన పరిశీలించారు. ఉదయం నుంచే అన్ని గ్రామాలలో సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు

సీఐ వెంకటేశ్వర్లు


విలేకరులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు, పక్కన ఎస్ఐలు రాజు, సూర్యశ్రీనివాస్

జగ్గయ్యపేటఅర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం మేరకు సామాన్యులకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేసిన ఉచిత ఇసుక పాలసీకి ఎటువంటి అప్రతిష్ట తెస్తూ అక్రమంగా ఇసుకను తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. జగ్గయ్యపేట సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత ఇసుక పాలసీని పటిష్టంగా అమలుచేసేందుకు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కట్టుబడి ఉందన్నారు. ఇసుకను అక్రమంగా తరలించేవారి విషయంలో ఎటువంటి ఒత్తిడిలకు లొంగకుండా కేసులు నమోదు చేస్తామన్నారు. గత ఆరునెలల వ్యవధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 55మందికి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయా కేసులకు సంబంధించి 46 ట్రాక్టర్లు, 23 లారీలు, 2 జేసీబీలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. జిల్లా పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఏపీ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమంగా తరలివెళ్లకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా 15 చెక్‌పోస్టుల్లో 45మంది సిబ్బంది రేయింబవళ్లు కాపలా కాస్తూ ఇసుక అక్రమరవాణా కాకుండా చూస్తున్నారని తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ జి.రాజు, చిల్లకల్లు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



నందిగామటౌన్: పింఛన్‌దారులకు సచివాలయ సిబ్బంది సకాలంలో పింఛన్ అందించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి ఆదేశించారు. మండలంలోని అంబారుపేటలో శనివారం ఆమె పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు. ఈసందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలో తొలిరోజునే నూరుశాతం పింఛన్లు పంపిణీ చేసేలా సిబ్బంది, అధికారులు పనిచేయాలని సూచించారు. పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని అంగనవాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం, విద్యాబోధన, పోషణ ఆహార పట్టిక తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో భాగ్యరేణుక, సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, అంగనవాడీ కార్యకర్తలు బేబిరాణి, పార్వతీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.